# స్త్రీ హృదయం

## కోమలాదేవి



పేరంటానికి వెళ్తున్నట్లు సింగారించుకుని వెళ్ళారు స్త్రీలంతా. అంతర్జాతీయ స్త్రీ (సంక్షేమ) సంవత్సరం – అంటూ పెద్ద సభ ఏర్పాటుచేశారు స్థానిక స్త్రీలు - పెద్దలు. పెద్ద పందిరి, మైక్‌లు-రికార్డులు వేయగానే చిన్నా పెద్దా జనం రావటానికి ప్రారంభించారు. అదే అదను అనుకుని పట్టుచీరలు కట్టుకుని ఆభరణాలు పెట్టుకుని వచ్చారు. ఈ సభవల్ల మనోవికాసం కల్గేమాట ఎంత? ఏమోకాని ఆ తరవాత డాన్స్ ప్రోగ్రాం ఉంది. కనీసం గంటసేపు పైసా ఖర్చులేకుండా చూడవచ్చునన్న ఆశతో చాలమంది స్త్రీలు, పెద్దవాళ్ళు కూడా వచ్చారు.

సెక్రెటరీ విమల తృప్తిగా పందిరి నలుమూలలా చూచింది. స్త్రీలతో సందడిగా కనులపండువుగా ఉంది.

అంతా పెద్దలు వేదికమీదికి వచ్చారు. పరిచయాలయ్యాయి. పూలమాలాలంకృతులను చేస్తుంటే ఉత్సాహంతో చప్పట్లు చరిచారు. ఆ తరవాత ఒక్కొక్కరే మాట్లాడుతున్నారు. స్త్రీల

హక్కులనుగూర్చి మాట్లాడుతుంటే వింతగా ఉంది. ఆ హక్కులను ఏం చేసుకోవాలి? అన్న అనుమానం కూడ వచ్చింది సభాసదులకు. పురుషుడి కూలి, స్త్రీ కూలి సమానం అన్నప్పుడు నిజంగానే ఆనందించారు. భూస్వాములభార్యల ముఖాలు చిన్నబోవడం ఎవరూ గమనించలేదు. "మీకు పిల్లలు చాలును అనుకున్నప్పుడు వెంటనే వెళ్ళి ఆపరేషన్ చేయించుకోవచ్చు - భర్త అనుమతి అవసరంలేదు. మీ కుటుంబ పరిమితి ఎంత ఉండాలో స్త్రీ నిర్ణయిస్తుంది"... ఊహూ... చాలమందికి ఈ హక్కు చాల ఎబ్బెట్టుగా తోచింది. "ప్రతి ఆడపిల్లకు చదువు చెప్పించాలి" హూః! ఆడపిల్ల బడికి వెళ్తే ఇంట్లో చంటి పిల్లను ఎవరుచూస్తారు? కూలి చేసుకునే స్త్రీలు పెదవి విరిచారు, ఇది బాగు లేదని... ఇలా గంటన్నరసేపు ఉపన్యాసకులు మాట్లాడారు.

ఆఖరుగా విమల మైక్ దగ్గర కొచ్చింది. క్లుప్తంగా ఎన్నో విషయాల్ని చర్చించి చివరకు అంది "ప్రస్తుతం మన సంఘంలోని స్త్రీ ఎన్నోవిధాలుగ అణగద్రొక్కబడుతోంది. ముఖ్యంగా అవివాహిత స్త్రీకి లేక అనివార్య కారణాలవల్ల ఇల్లు విడిచిన స్త్రీకి ఎక్కడికి వెళ్ళినా అన్నీ అడ్డంకులే. ఆమెను [illegible] కట్టించి ఒక [illegible] వస్తువుగా [illegible] పురుషలోకం. నిరాశ్రయురాలైన స్త్రీకి రక్షణలేదు. ఆమె జీవచ్ఛవంలా బ్రతుకుతూ దేహాన్ని చివరికి అర్థరూపాయికు కూడ అమ్ముకోవలసిన స్థితికి దిగజారిపోతుంది. అటువంటివారికి ఒక ఆశ్రయం కావాలి. అవివాహిత తల్లులకు - అలా పుట్టిన బిడ్డలకు ఒక గృహం నిర్మించాలి. ఒక శరణాలయం కావాలి. అందుకు మనమందరం సాయశక్తులా ప్రయత్నించి చందాలు ప్రోగుచేయాలి. ప్రజా సేవ చేయటానికి చాలమంది సిద్ధంగాఉన్నారు. వారి సహాయంతో ఈ హోంను మనం నడిపించాలి. ఇటువంటి శరణాలయం మన ఊళ్ళోలేదు. నిలువ నీడలేని స్త్రీకి అక్కడ ఆశ్రయం లభించాలి. ఈ క్షణంలోనే మీరంతా నాకు ప్రమాణం చెయ్యాలి. ఈ సంవత్సరం తిరక్కుముందే ఒక హోంను కట్టాలి. అంతవరకు చిన్న అద్దెయింట్లో ఇలాంటి వారికి ఆశ్రయమివ్వాలి. చిన్నవారైతే వారిని బడికి పంపే ఏర్పాటుచేస్తాము. పెద్దవారైతే వారికొక పని కల్పిస్తాము. ఇక్కడ కూర్చున్న డాక్టరుగారు - లాయర్‌గారు - మనకు తగిన సలహాలు ఇస్తారు. రేపటినించి చందాలు ప్రోగుచేస్తాము మనమంతా స్త్రీలం. మనల్ని ఒకరు ఉద్ధరించనవసరం లేదు. ముందు మనల్ని మనం ఉద్ధరించుకుందాము..."

విమల మాటలు ఎందరు విన్నారో [illegible] వినలేదో [illegible]ందిట్లో [illegible] [illegible] కలకలం బయలుదేరింది.

ఉమాళ్ళ చందాల మాటకు విసుక్కుంటు నా రో - లేక డాన్స్ ప్రోగ్రాంకు సంబంధించిన సరంజామాను చూచి సంబరపడుతున్నారో ! చెప్పటం కష్టం సభ విజయవంతంగా ముగిసింది

గాన్సర్ మోహిని (అసలు పేరు మంగమ్మ అని గుసగుసలాడారు) అప్పుడే రెండు వేలు విరాళం ఇచ్చింది. ఆ సభ ముగిసేసరికి దాదాపు పదివేల రూపాయల విరాళం ప్రోగైంది.

పెద్ద ఫైల్‌తో ఇంట్లోకి అడుగు పెట్టిన భార్యను చూచి చిరునవ్వుతో పలుకరించాడు ప్రభు "మీ మీటింగ్ ఎలా జరిగింది ? జుట్లు పట్టుకున్నారా ?"

విమల గర్వంతో ఫైల్ అందించింది. "జుట్లు కాదు. నోట్లు పట్టుకున్నాను. చూడండి" ధీమాగా వెళ్ళి సోఫాలో చేరబడి కళ్ళుమూసుకుంది...

... ఆ నిలయం మహా భవన రూపంలో ఆమె మనోనేత్రంలో కన బడింది... ఎంతోమంది ఆశ్రయం కోరుతూ రేయింబవళ్ళు ఆ నిలయంలోకి వస్తున్నట్లు ఊహించుకుంటూ మురిసి పోతోంది... ఆమె పెదిమలపై తారట్లా డుతోన్న మందహాసాన్ని చూస్తూ నవ్వుకున్నాడు ప్రభు

"గుడ్... చాల సాధించారు. ఈ డబ్బు .. ఆ ప్రోగయ్యే డబ్బు ఎవరి జేబులోకి... ఐ మీన్ ఎవత్తి పర్స్‌లోకి వెళ్ళకుండా జాగ్రత్తగా చూడాలి. నెల నెలా దానికి ఆదాయం కావాలి. ప్రభుత్వం ఈ పని చెయ్యాలి. వెంటనే పని ప్రారంభించండి... ..ప్రభుత్వం నెల నెలా కొంత డబ్బు పంపితే ఆ తరువాత మిగతా ప్రోగ్రాం చూడ వచ్చు... "అని గభాల్న ఆపుజేసి విమల ఎదురుగ కూర్చుని అన్నాడు "ఔనూ ఒక పదిహేను రోజుల్లో కనీసం అద్దె ఇంట్లోనైనా ఏదైనా ఏర్పాటుచేయ గలరా ?"

"ఎందుకూ ?" అంది ఆశ్చర్యంతో

"ఇవ్వాళ మా హాస్పిటల్‌కి ఒక అమ్మాయి వచ్చింది. పాత కథే. ఇంకో వారానికి ప్రసవించవచ్చు ఆ తర్వాత ఆమెను ఎక్కడికి పంపాలో తెలియక మేమంతా బుర్ర బద్దలుకొట్టుకుంటున్నా మనుకో మా ఆయాకు ఎవ్వరూలేరు. ఓ పదిరోజులు పెట్టుకోమంటే సరేనంది. ఆ తరవాత ? చూస్తూ చూస్తూ బాలెంతను, చంటిపిల్లను వీధి పాలు చేయగలమా ? దేవుడిలా ఈ ప్లాన్ వేశారు. ఇకనేం, మీకు ఫస్ట్ ఇన్‌మేట్స్ దొరికినట్లే. ఈ ఇద్దరితో మీ హోంకు ప్రారంభోత్సవం జరిపించండి..."

విమలకూడ చాల ఎగ్జైట్ అయింది. అలాగేనంది ఆ రాత్రి చాలసేపు మానవ సేవయే మాధవసేవగా ఎంచుకున్న ఆ దంపతులు శరణాలయంను గూర్చిన ముచ్చట్లతోనే కాలం గడిపారు.

దాని వాస్తవంలోకి అడుగుపెట్టగానే

అడుగడుగున అవాంతరాలే వచ్చాయి. అసలు మొట్టమొదట అద్దెకు ఒక ఇల్లు లేదు గదా ఒక్క గది దొరకటం కష్టమై పోయింది. అది ఎందుకో తెలిసిన ప్రతి ఒక్కరు ''టులెట్'' బోర్డులు ఉన్నా ఎవరో అడ్వాన్స్ ఇచ్చి వెళ్ళారని అబద్ధమాడారు. వాళ్ళు కోరి ఇద్దె కివ్వటంలేదని తెలిసికూడా ఏమీ చేయలేకపోయారు. ధనవంతుల కాంపౌండ్‌లో స్థలంకోసం ప్రయత్నించి విఫలులయ్యారు. పక్షంరోజులు దాటినా ఒక్క అంగుళం ముందుకెళ్ళలేకపోయారు.

ఈ పక్షంరోజుల్లో వారి ప్లాన్స్ అన్నీ కాగితాలమీద ఉండిపోయాయి. కాని ఆ అమ్మాయి కడుపులో పాప అలా స్థిరంగా ఉండిపోలేదు. చక్కటి ఆరోగ్యవంతురాలైన బిడ్డను ప్రసవించింది. వారంరోజులు హాస్పిటల్‌లో ఉంది. ఆ తరవాత వారంరోజులు ఆయా ఇంట్లో ఉంది. మరికొన్ని రోజులు ఆమె యింట్లోనే ఉండేట్లు ఏర్పాటు చేయాలనుకున్నారుగాని ఆయా యింటతను పేచీపెట్టాడు. అసలు కారణం తెలుసుకున్న ఆయా ముక్కుమీద వ్రేలేసుకుంది. అమ్మాయిమీద జాలిపడింది కాని చేసేది లేక మరోచోటికి చేర్చాలని ప్రభుకు చెప్పింది. దాంతో సమస్య మొదలైంది. ఆలోచిస్తూ కూర్చున్నాడు. ఆ అమ్మాయికి భద్రతలేక హిస్టీరికల్‌గా తయారవుతున్నదట. అనుక్షణం తన గతి ఏమవుతుందో అని తలంచుకుని కుమిలిపోయి ఏడుస్తోందట పాపం... అన్నీ వింటూ ఏమిచేస్తే బావుంటుందో ఆలోచిస్తోంది విమల

ప్రభుకు ఒక ఆలోచన రావటం తడవు సంతోషంతో అరిచాడు "అరె దీనికింత ఆలోచించాలా విమలా ? నువ్వు సెక్రెటరీవి మన ఇంటికి తీసుకొస్తే ఏం ! మేడమీది గది మనం వాడము కదా ? ఈ హోం పెట్టేదాకా పైనే వుంటుంది."


ఎంత ఉత్సాహంతో ఎంతో రిలీఫ్‌గా ఫీలవుతూ చెప్పాడు గాని విమల మౌనం అతి భయంకరంగా తోచింది.

గ్రుడ్లప్పగించి "మీకు మతిగాని పోలేదుకదా ?'' అన్నట్లు చూస్తోంది- ఆమె పెదిమలు కఠినంగా ఒంపు తిరిగాయి.

"అలా చూస్తావేం ?"

"ఇంకెలా చూడాలి ? శభాష్... భలే మార్గం చూపారు ! అని మిమ్మల్ని మెచ్చుకోవాలా ?..." ఎంతో ఏవగింపుగా అంది.

ప్రభు శి లా ప్ర తి మ యే అయిపోయాడు. అతని నోట మాటరాలేదు. ''ఈమె ఈమేనా........ ఒక హోం కోసం సాయశక్తులా ప్రయత్నిస్తోంది... ఎండనక వాననక విరాళాలు ప్రోగు చేస్తోంది... సహ స్త్రీని ఉద్ధరించాలని కంకణం కట్టుకున్నది ! హే ప్రభూ...




స్త్రీకి స్త్రీయే శత్రువు. స్త్రీని ఉద్ధరించా లని ప్రథమంలో పూనుకున్నవారంతా పురుషులు కావటంలో ఆశ్చర్యం లేదు," అనుకున్నాడు.

"విమలా... ఆనాడు అంతసేపు ఇలాంటి స్త్రీని ఉద్ధరించాలని ఆమెకొక ఆశ్రయం కల్పించాలని ఉపన్యసించావు! ఈనాడు అటువంటి అవకాశం లభిస్తుందే వెనక్కి పోతున్నావెందుకు? నువ్వూ అందరిలా పిరికిదానవేకదూ? నిజంగా నీలో ఇంతటి మహోన్నత భావం కల్గలేదు. అది కేవలం పలుకుబడి కోసం నలుగురి ఎదుట గొప్ప ప్రజా సేవకురాలిగా. కనబడాలన్న కాంక్షతో చేసిన పని ఇది. సరే కానియ్. ఏదో మార్గం దొరక్కపోదు. కాని నీ అసలు రంగు గుర్తించాను విమలా. చాల బాధగా ఉంది ఇంతకన్నా, ఎక్కువ మాట్లాడితే నిన్ను ఏమేమో అనగలను.." అతడు ఆమె ఎదుట ఉండలేను అన్నట్లు గబగబ జోళ్ళు తొడుక్కుని వెళ్ళిపోయాడు.

విమల విచారించలేదు. అతడు త్వరగానే తన అయిష్టతను గుర్తించి నందుకు ఆనందించింది. ఎవత్తెనో ఎవడికో కన్న బిడ్డతో వచ్చి తన ఇంట్లో ఉంటుందా? అలాంటివారు చెట్టు నీడలో ఉండి అడుక్కుతినాలేగాని తన ఇంట్లో - అందులో తన భర్తలాంటి వ్యక్తి ఎదుట మసలటమా? ప్రభుది మంచి రూపం మంచి మనసు. స్నేహ శీల అతడి మనసు చలిస్తుందేమో! తన భయాలు తనవి. మంచిదే... ఆమెను ఎక్కడో ఉంచనీ, అనుకుని తృప్తిపడింది.

ప్రభు పిచ్చిగా తిరిగాడు. ఆమెను

ఎక్కడ ఉండాలా అన్నది పెద్ద సమస్య కాదు. ఎక్కడో ఆశ్రయం దొరక్క పోదు. ఇమె లాంటి సంస్కార వంతురాలు - విద్యావతి - ప్రతిభాశాలి స్నేహశీలి — కార్యదీక్షగల వ్యక్తి ఎంతటి వెలితి భావాలు కలది ! మసి పూసిన అంతరాన్ని ఈ రంగు రంగుల తెరలతో కప్పిపుచ్చుకుంది. తను ఎంత ఘనంగా ఫీలయ్యాడు !

ఆమెనుగూర్చి ఎంత గొప్పగా చెప్పుకున్నాడు !

ఛీ... ఆమెకూడ మామూలు స్త్రీ. తనకు ఆమె ఏ విధంగాను సాయ పడదు.

తిరిగి తిరిగి ఆయా ఇంటికి వెళ్ళాడు.

ఆయాను బైటికి పిల్చాడు. "నెల రోజులు సెలవు తీసుకుని ఇంట్లోనే ఉండిపో. ఆ అమ్మాయికి తోడుగా ఉండు. డబ్బు సంగతి చూస్తాను. అమ్మగారి హోం ఇంకా మొదట్లోనే ఉంది. ఇంటిలను గొడవచేస్తే ఇల్లు మార్చెయ్యి"

జేబులో ఉన్న ఇరవై రూపాయల చిల్లర ఆమె దోసిట్లోపోసి చటుక్కున తిరిగి వెళ్ళిపోయాడు.

ఆయా అతడివేపు ఆరాధనతో చూస్తూ "ఇంత మంచి బాబుకు ఆ దేముడు ఒక్కనలుసు నిచ్చాడు కాడు. ఈ పిల్లకు పద్దంటే ఇచ్చాడు ! అనుకుంది

ఎంతో సేపు బైట తిరిగి కూల్ డ్రింక్ తాగి మనసు స్థిమితపడిన తరువాత ఇల్లు చేరుకున్నాడు. స్నానంచేసి రాగానే అలవాటుగా ఇద్దరూ భోంచేశారు ఎంత మామూలుగ ఉండాలన్నా ప్రభును అదృశ్యపగ్గం పట్టిలాగుతున్నట్లు వుస లాడు. ఆమె విషయం ఏంచేశారు ? అని అడగటానికి విమలకు ధైర్యం చాలలేదు

సరిగ్గా నాల్గురోజులు గడిచాయి. అవిరామంగా-మార్పులేని కార్యక్రమంతో ఆ నాల్గురోజులు గడిచాయి.

ఆ రోజు సాయంత్రం ఎంతో ఉత్సాహంతో ఇంటికొచ్చాడు. కాఫీ ఫలహారంచేసి జేబులోంచి ఓ కవర్ తీసి విమలకందించాడు. దస్తూరీ చూచి పోల్చుకున్నది. అది ప్రభు ప్రాణ స్నేహితుడు - రవి రాసినది. ఇద్దరికి రాస్తాడు. ఆమె ఆత్రంగా తీసి చదవటం మొదలుపెట్టింది... ఉభయకుశలానం తరం...

"...ఈ సమయంలో ఒక విషాద వార్త మీకు చెప్పవలసి వస్తున్నందుకు విచారిస్తున్నాను. చెల్లి కుసుముకు ఈ మధ్య పెళ్ళిచేశాము అంతా మూడు నాల్గు రోజుల్లో జరిగిపోయింది. (తెలిసిన కుటుంబమే). అందుకని మీకు శుభ లేఖ పంపటానికే వ్యవధి లేకపోయింది.

అతడు ఇక్కడే సబ్ పోస్టాఫీసులో పని చేసేవాడు. మూడు నెలలు గడిచి పోయిన తరువాత ఒకనాడు చాల సీరియస్ అయింది. మెనింజైటిస్‌తో మరణించాడు. కుసుమకు రెండవ నెల. చాల దుఃఖంలో ఉంది ఈ ఊరు ఈ పరిసరాలు ఆమెను మరీ పిచ్చిదానిగా చేస్తున్నాయి. నాకు అన్నదమ్ములు అప్పచెల్లెండ్రు లేరు. ఎక్కడికైన మార్పుకు పంపుదామంటే నాకెవరూ లేరు. దూరపు బంధువులు ఇంతటి బాధ్యతను తీసుకోగలరా? మీరు జ్ఞాపకం వచ్చారు. కుసుమను తెచ్చి మీ దగ్గర విడిచి వెళ్తే ఆమె బాధ్యతని వహించగలరా? ప్రసవించేంతవరకు మీ దగ్గర ఉంటుంది. ఆ తరువాత బి.ఎ.లో చేర్పించి చదివిస్తాను... ఆమెకు మార్పు ఎంతైనా అవసరం మీ జవాబు కోసం ఆశతో నిరీక్షిస్తుంటాను..."

"పాపం, కుసుమకు అన్నీ అయిపోయాయి. వస్తుండే పోస్టుమాన్ ఉత్తరా లిచ్చాడు. రవి నుంచి ఉత్తరం చాల రోజులకు వచ్చిందన్న సంతోషంతో ఉన్నానేగాని అది ఇలాంటిదని అనుకోలేదు. ప్చ్.. మన జవాబు అతడికి శరాఘాతంగా ఉంటుందేమో" అన్నాడు బాధగా.

"ఎందుకు?" అంది ఆత్రంగా.

"మరి... కుసుమ బాధ్యత నెత్తి మీద వేసుకుందామా?" "అయ్యో, మన మీద ఎన్ని ఆశలు నిల్పుకున్నారో... స్నేహితులన్న తరువాత ఇలాంటి సమయాల్లోనే ఆదుకోవాలి. వెంటనే ఉత్తరం రాసేద్దాం. కుసుమను తెచ్చి వదిలిపెట్టి వెళ్ళమని. ఎంత ఆశతో ఎదురుచూస్తుంటారో పాపం" విమల సానుభూతితో అంది.

అప్పటికప్పుడు ఇద్దరు కలసి ఉత్తరం రాసేశారు పోస్టుకు కూడా పంపారు.

వీరుండేది మదనపల్లిలో. రవి వాళ్ళుండేది విశాఖపట్నంలో. వారం రోజులు దాటిన తర్వాత ఒకనాటి ప్రాతఃకాలం రవి కుసుమ దిగారు.

కుసుమను చూసి విమల ఆశ్చర్యపోయింది.

సన్నగా ఎండిన జాజిమొగ్గలా ఉంది కుసుమ. కాలేజీకి వెళ్ళే అమ్మాయిలా ఉంది నుదుట కనీకనిపించని చుక్క పెట్టింది. ఆమెను చూడగానే భర్తృహీన అనుకోరు.

మంచిదే, చిన్నపిల్ల పదిహేను పద్దెనిమిదేళ్ళుంటవచ్చు, అనుకుని తృప్తిపడింది.

రవి రెండు రోజులు ఆగి మూడవ నాడు ప్రయాణమయ్యాడు. అతి కష్టంతో చెల్లికి చెప్పాడు ప్రభుకు చెప్పటానికి ఏముంది! రెండుచేతులు పట్టుకుని కన్నీరు నిండిన కళ్ళతో కృతజ్ఞతతో

చూచాడు. విమలకు చెప్పి వెళ్ళి పోయాడు.

కుసుమ దాదాపు మౌనవ్రతం దాల్చినట్లే ఉండేది.

వేవిళ్ళతో బాధపడుతుంటే విమల ఎంతో సేవచేసింది. కాస్త సర్దుకుంటుంటే నోటికి రుచించే పదార్థాలు చేసిపెట్టేది వద్దన్నా. చీకటిపడిన తరువాత షికారుకు తీసుకుని వెళ్ళేది, అప్పుడప్పుడు బలవంతంగా సినిమాకు తీసుకెళ్ళేది. అందరికీ మెల్లగా చెప్పేది "మావారి పెదతండ్రి కూతురు. పెళ్ళయిన మూణ్ణెల్లకే జబ్బుచేసి చనిపోయారు ఆయన, అందుకే తీసుకొచ్చాము" అందరు సానుభూతి చూపేవారు.

కుసుమ గది విడిచి బైటికొచ్చేది కాదు. వారి ఓదార్పు మాటలు వినాలన్న అభిలాష లేదు. దిగులుగా ముభావంగా కూర్చునేది పెద్దవాళ్ళు కుసుమ వస్త్రధారణలో విముఖత చూపిస్తూ ఏదో అనేవారు. కాని విమల నర్దిచెప్పేది "ఈ కాలంలో ఆ పాత దురాచారాల్ని మాన్పించాలండీ. రేపు బిడ్డపుట్టిన తర్వాత కాలేజీకి వెళ్ళి చదువుకుంటుంది. ఆ తర్వాత ఉద్యోగం చేస్తుంది. ఎవరైనా పెళ్ళాడటానికిష్టపడితే పెళ్ళిచేస్తాము చట్టవిరుద్ధమూకాదు – ధర్మ విరుద్ధమూ కాదు. మనమంతా ఇటువంటివారికి జీవనోపాధి కల్పించాలి వీలైతే పెళ్ళి చేసి పంపాలి పదిహేడేళ్ళ పిల్ల మూడు నెలలు కాపరంచేసిన ఫలితంగా జీవితాంతం విధవగా కాలం గడపటం న్యాయమేనా? ఇటువంటివారికి చేయూతనివ్వాలని ప్రతివారికి ఉంటుంది. కాని ఇంకొకరేమనుకుంటారో అన్న భయంతో వెనక్కి తగ్గుతాము. ఆ భయం మనల్ని లొంగదీస్తుంది. అందుకే ఈ శరణాలయాన్ని స్థాపించాలని అంత ఆత్రపడుతున్నది."

మూడు నెలలకు శరణాలయం అన్న బోర్డు తగిలించటానికి అనువైన ఇల్లు దొరికింది. మూడు గదుల ఇల్లు. వెనుక నూతిపళ్ళెం ఉంది. నుయ్యి లేదుగాని అక్కడే బోరింగ్ పంపు ఉంది. ఒక పెద్ద వేపచెట్టు ఉంది. దానికి ప్రారంభోత్సవం జరిపించలేదు గాని ఫలానా చోటున శరణాలయం ఉందని కరపత్రాలు పంచిపెట్టారు. స్థానిక మండలి సభ్యులు, ఇతర ఆఫీసర్లు వచ్చి తనిఖీచేసి వెళ్ళారు.

ఆ గృహంలో మొట్టమొదట అడుగు పెట్టింది ఆయా ఇంట్లో ఉన్న అమ్మాయి. ఆమె కొడుక్కి అప్పుడు నాలుగవ నెల. ఆయా హాయిగ ఊపిరించుకుని ఇంటికి సంతోషంగా వెళ్ళింది. పోనీ తలదాచుకోటానికి ఆశ్రయం దొరికిందని ఆమె అమితంగా ఆనందించింది.

శరణాలయాన్ని స్థాపించిన మూడవ రోజున విమల కుసుమను వెంటబెట్టు

కుని అక్కడికెళ్ళింది. అప్పటికి ఇంకా ఆ అమ్మాయి వనజ బిడ్డమాత్రమే ఉన్నారు

వనజ చేతి మెషీన్ ముందర కూర్చుని బ్లౌజుకుట్టోంది. వనజ - కుసుమ దాదాపు సమవయస్కుల్లా కనిపించారు. కుసుమ చిన్నవాడిని ఎత్తుకుని ముద్దులాడింది.

మెల్లగా వనజ కుసుమను మాటల్లోకి దింపింది. "ఇల్లాంటి ఆశ్రయం దొరుకుతుందని కలలోకూడ అనుకోలేదు. నాది పాత కథ. నమ్మి మోసపోయాను. ప్రేమకు వివాహానికి మధ్యలో పెద్ద అఘాతం ఉందని అప్పుడు నాకు తెలీదు. ప్రేమ అనేది మందబుద్ధి కల్గించింది. పరిశీలనగా చూచే శక్తి నశించింది. అనుకున్నదంతా జరుగుతుందని నమ్మాను. నిజమైన ప్రేమ చిరకాలం నిలుస్తుందనుకున్నాను. కాని ఇద్దరం చిన్నవాళ్ళమే. అతడు నాలా స్టూడెంటే. అతడు నన్ను పోషిస్తాడని ఎలా అనుకున్నాను? ఏమో! ఆ రోజుల్ని పునరావృతం చేసుకుందే సిగ్గుకూడా. అటు ఇటు ఎవ్వరికి అంతగా డబ్బులేదు. యౌవనపు పొంగులో ఇవన్నీ అట్టడుగున పడిపోయాయి. కనీసం గుళ్ళో పెళ్ళన్నా చేసుకోలేదు. పెళ్ళికేం తొందర! అనుకున్నాను. అతడు నావాడైనప్పుడు అతడికి మన స్ఫూర్తిగా అర్పించుకున్నప్పుడు వేరే అనుమానాలెందుకొస్తాయి! ఇద్దరం లేచి పోయాము. సరిగా పదిరోజుల్లో తేలిపోయింది ఒక్కత్తిని మిగిలిపోయాను. ఇంటికెళ్ళాను వెళ్ళగొట్టినంత పని చేశారు. ఆ తరువాత మా పెద్దక్కయ్య తన వెంట తీసుకెళ్ళింది మా బావగారు రోగిష్టి. అక్క పనిచేస్తుంది ఇంటి పనిలో సహాయంగా ఉంచుకుంటానంది. ఆ నెలలోనే తేలిపోయింది నేను ఒంటరి మనిషినికానని. మూడు నెలలు కడుపులో దాచుకుని నన్ను చూచుకుంది ఆ తరువాత ఎక్కడికి పంపాలో తోచ లేదు. చివరికి హైద్రాబాద్‌లో శరణాలయం ఉందని అక్కడికి తీసుకెళ్ళి విడిచి వచ్చింది ఒక నెలరోజుల్లో నేను ఎటువంటి విషవలయంలో చిక్కుకున్నానో తెలిసింది ఆ గృహాలు పైకి శరణాలయాలు లోలోపల అవివ్యభిచార గృహాలు. ఆ సంగతి తెలిసిన వెంటనే అదను చూచి బైటపడ్డాను. ఎక్కడికి వెళ్ళను? మెల్లగా ఒక ప్రైవేట్ హాస్పిటల్‌కు వెళ్ళాను. ఆ డాక్టరు దబ్బిచ్చి మీ అన్నగారి దగ్గరకు పంపారు. హాస్పిటల్‌లో ఆ పనీ ఈ పనీ చేసేదాన్ని. తిండి బట్టకు లోటు లేక పోయింది. నెలలు నిండుతుంటే నాకు ఆ తరువాత ఆశ్రయంఎక్కడ దొరుకుతుంది -! అని విచారించని క్షణం లేదు. ఆ భగవంతుడే నాకి మార్గం చూపాడు. ఏదో విధంగా నా పొట్ట నేను పోషించుకోవాలి. పీకితో తిరిగి వెళ్ళ

లేను. పీడిని విడిచి వెళ్ళలేను. అందుకే ఇక్కడే ఉండిపోవాలనుకుంటున్నాను

కుసుమ అంతా విన్నది. విమల చెబుతుంటే ఉద్రిక్తయై ఏడ్చింది కూడా. సానుభూతి మాటలు నాల్గు చెప్పి అంది.

"అసలు ఇలాంటి గృహాలకు కాలేజి విద్యార్థినులను విజిట్ కు తీసుకెళ్ళాలి. చిన్న వయసులో అందర్నీ పోగొట్టుకుని నిరాధారులై పడరాని పాట్లు పడుతున్న అమ్మాయిలను వాళ్ళు చూడాలి. వారు నిజం గుర్తించాలి. వివాహపూర్వ ప్రేమ పనికిరాదని వారు తెలిసికుంటారు. తండ్రి పేరు పెట్టుకోటాని కర్త లేని పసివారి ముఖాలను చూచి వారి హృదయాలు చలించాలి. అటువంటి పొరపాటు తాము చేయకూడదని తెలిసికొంటారు.. నేను మీ లాంటి పొరపాటు చేయబోయాను కాని వెంటనే పెళ్ళిచేశారు. కాని ఇప్పుడేం జరిగింది..." కుసుమ కంట నీరు పెట్టింది

"వద్దు... మీరు ఏడవకూడదు. మీరు చిన్నవారు. మీ భవిష్యత్తు మాలా అంధకారబంధురంకాదు. మీ పాపకు, మీకు ఎక్కడికెళ్ళినా తెరచిన తలుపులే ఎదురౌతాయి."

కుసుమ అక్కడినించి లేచి వెళ్ళిపోయింది.

విమల "పాపం" అనుకుని తన కుట్టులో నిమగ్నమైపోయింది. మరో నెలరోజులు గడిచిపోయిన తరువాత మరో నలుగురు స్త్రీలు చేరారు. అందరివీ కన్నీటి గాథలే

కాని అక్కడ వారు తమ పాత జీవితాన్ని మరిచిపోయినట్లే నటిస్తూ యాంత్రికంగా తమ పనులు చేసుకుపోతున్నారు. స్త్రీకి భద్రత అంటూ ఉంటే కనీసజీవితావసరాలు తీరితే ఆమెకు సెక్స్ జీవితం అవసరంలేదు స్త్రీకి సెక్స్ ఆరవస్థానంలో ఉంటుంది. ఎవ్వరో కాని కోరి వ్యభిచరించి ఆనందించరు.


విమలకు చేతినిండా పని ఉంది

ప్రభు ఆమెకు ఏ విధమైన సలహాలూ ఇవ్వడు. శరణాలయం విషయాలే పట్టించుకోడు. అనారోగ్యంతో ఉన్న వారికి, డాక్టర్ కాబట్టి మందులిచ్చేవాడు.

ఒకానొక ప్రాతఃకాలసమయంలో కుసుమ ఆడపిల్లను ప్రసవించింది. పాప ఆరోగ్యంగా ఉంది. ఆ తరువాత నెం రోజులుగడవక ముందే రవి వచ్చి తీసుకెళ్ళిపోయాడు కాలేజీలో చేర్పించాలని, లేటవుతే కష్టమని చెప్పాడు.

కుసుమ విమలకు కృతజ్ఞతతో నమస్కరించి సెలవు తీసుకుంది. ప్రభు ఎదుట నుంచుని భోరున ఏడ్చింది

ప్రభు చెమ్మగిలిన కళ్లను వత్తుకుంటూ ధైర్యం చెప్పాడు. అప్పుడప్పుడు కుసుమనించి ఉత్తరాలొచ్చేవి చదువు బాగా సాగుతున్నట్లు. గుంటూరు విమెన్స్




కాలేజిలో చదువుతోంది. పాపను వాళ్ళ నానమ్మగారింట్లో ఒదిలినట్లు రాసింది.

రానురాను ఉత్తరాల సంఖ్య తగ్గిపోయింది.

ఒకనాడు బి. ఎ. పాసయినట్లు రాసింది.

ఆ తరువాత ఎం. ఏ. లో జేరినట్లు రాసింది.

మరి ఉత్తరాలు లేవు. రవిద్వారా అప్పుడప్పుడు ఆమె క్షేమ సమాచారాలు తెలిసేవి

విమలకు బాధ్యతలు ఎక్కువయ్యాయి

వనజకు మరిద్దరిని తోడిచ్చి టైలరింగ్ షాప్ ఆశ్రమంలోనే పెట్టించారు. విరక్తితో ఆ శరణాలయానికి వచ్చిన వారిని మామూలు మనుషులుగా చేయటానికి అక్కడివారు విమల ఇతర సహాయకులు ఎంతో పాటుపడవలసి వచ్చేది.

అనుకున్నట్లు నాలుగేళ్ళలో పది గదులు కల 'హోం' కట్టించగల్గారు. అక్కడికి వచ్చే స్త్రీ ఎవరి తాలూకో కనిపెట్టటానికి కొన్నిసార్లు పోలీసు సహాయం తీసుకోవలసి వచ్చేది భర్త హాస్పిటల్‌లో ఉన్నంతసేపు విమల 'హోం'లో గడిపేది.

ఆ శరణాలయ ప్రారంభోత్సవం నాడు ఏదో కేసుందని - చాలా సీరియస్ కేసని ప్రభు ప్రక్క ఊరికి వెళ్ళిపోయాడు.

దాని అంతరార్థం ఒక్క విమలకే తెలుసును. ఆమె హృదయం గాయపడింది.

కుసుమ ఎలా ఉన్నదో? అని

ఏడాది కొకమాటు అనుకోటానికి కూడా వీల్లేనంత పని విమలకుండేది.

కాలగతిలో తొమ్మిది సంవత్సరాలు దొర్లిపోయాయి.

ఆ రోజు ఇంటికొచ్చిన ప్రభు ముఖం ఆనందంతో నిండిఉంది. రాగానే ఒక శుభలేఖ బల్లమీద వేశాడు.

"చూడు విమలా... ఎవరిదో..."

ఆత్రంగా విప్పింది...

చి.సౌ॥కుసుమకు

చి. విజయానంద్‌కు...

"మన కుసుమ పెళ్ళండీ" ఆనందంతో అంది.

"ఔను. అతడు చాల మంచివాడట." అని లోపలికెళ్ళిపోయాడు.

"మంచివాడు కాబట్టే విధవను పెళ్ళాడుతున్నాడు."

"అందుక్కాదు మంచివాడనటం" అని విమలకు ఒక కవరు అందించాడు. అది చాల పాతగా పసుపువన్నె దాల్చిన కవరు భర్త ఇచ్చినదాన్ని అందుకుని సంశయంతో చూచింది. "చదువు" అని కుర్చీలో కూర్చుని కాఫీ కప్ అందుకున్నాడు.

అది కార్బన్ కాపీ ఉత్తరం. ప్రభు రవికి రాసిన లేఖ. పది సంవత్సరాల క్రితం తేదీ వేసి ఉంది.

విమల ఆత్రంగా చదివింది.

"రవీ,

కుసుమను గూర్చి నువ్వు రాసిన వివరాలు చదివి చాల విచారించాను. స్నేహితుడిగా నీకు సహాయం చేయాలని నిశ్చయించుకున్నాను. కాని...కుసుమ కాలుజారి గర్భవతి. అయిందన్న విషయం విమలకు తెలిస్తే గుమ్మం ఎక్కనివ్వదు. అందుకని మూడు నెలల క్రితం వివాహమైందని భర్త పోయాడని ఒక ఉత్తరం రా... నీ ప్రజ్ఞ నంతా ఉపయోగించి అనుమానాని కాస్కారం లేనటువంటి లేఖ రాయి. కుసుమకు కూడ ఈ విషయం చెప్పి మౌనంగా ఉండమను. కుసుమ ప్రసవించిన తరువాత బిడ్డను ఎవరికైనా పెంపకానికివ్వటమో - లేదా అనాథ శరణాలయానికివ్వటమో - ఆ విషయం నేను చూచుకుంటాను. ఈ సమయంలో మనం తెలివిగ ప్రవరిస్తేనే కుసుమ భావి జీవితం సుఖప్రదమౌతుంది.

బెస్ట్ ఆఫ్ లక్

ప్రభు."

విమల చాలాసేపు మౌనందాల్చింది ఆ తరువాత అంది "పాప ఎక్కడుంది?" ప్రభు ఆశ్చర్యంతో చూచాడు "మన పాపగా హైద్రాబాద్‌లో నా ఫ్రెండ్ ఇంట్లో పెరుగుతోంది" అన్నాడు.

"రేపే వెళ్ళి తెచ్చుకుందాము?" జవాబుగా ఆమెను కౌగిట్లోకి తీసుకుని ఆమె కళ్ళను తుడుస్తూ "రేపే వెళ్ళి తెచ్చుకుందాం" అన్నాడు ప్రభు.